క్లుప్తంగా

వ్యవసాయ విద్యుత్‌కు నేడు, రేపు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని వీరవల్లి సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున సోమ, మంగళవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వీరవల్లి ఫీడర్‌లో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నారు. ఈపీడీసీఎల్ డీఈ నారాయణం అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. త్రీఫేజ్ సరఫరా తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకూ, మధ్యాహ్నం 4 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇస్తామని పేర్కొన్నారు.

దేవరపల్లిలో...

దేవరపల్లి: ఆర్‌డీఎస్ పనుల నేపథ్యంలో దేవరపల్లి సెక్షన్ పరిధిలోని దుద్దుకూరులో సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ (ఆపరేషన్స్) ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. గ్రామంలో ఆర్‌డీఎస్ పనులు జరుగుతున్నందున 33/11 కేవీ దేచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని దుద్దుకూరు 11 కేవీ రూరల్ ఫీడర్‌లో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణ

నిడదవోలు : స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయం గీత మందిరంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త తులసి, సుబ్బలక్ష్మీ, చందు, జ్యోతి ప్రసన్న, గంట సంధ్యారాణి, జీవరపు భ్రమరాంబ, బొమ్మకంటి కామేశ్వరి, గమిని వెంకటరత్నం, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు ప్రత్యేక బస్ సర్వీస్

నిడదవోలు : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రతి శనివారం ఉదయం 4.30 గంటలకు తాడేపల్లిగూడెం, భీమడోలు మీదుగా ద్వారకాతిరుమలకు ప్రత్యేక బస్ సర్వీస్ నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం కె.వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనానికి ఉదయం 5 గంటలకు బస్ సర్వీస్ ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉండ్రాజవరం: తణుకు వద్ద జాతీయ రహదారిపై ఉండ్రాజవరం మండలం చివటం పరిధిలో ఆదివారం సాయత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జాతీయ రహదారిపై చివటం కమ్మ కల్యాణ మండపం సమీపంలో తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు మోటార్‌సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. 108 వాహనం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఉండ్రాజవరం ఎస్సై గుబ్బల శ్రీనివాసు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీరు

నిడదవోలు రూరల్: జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని సింగవరంలో రూ.53.08 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్, పైపులైన్లు, బోరు, కుళాయిల ప్రారంభోత్సవ శిలాఫలకాలను మంత్రి దుర్గేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, నాయకులు పెన్మెత్స చందు పాల్గొన్నారు.

కులమతాలు అహేతుకం

కడియం: దైవజ్ఞానం ప్రకారం కులమతాలు అహేతుకమని త్రైత సిద్ధాంతి ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని వేమగిరిలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బి.లోమిత, కే.శోభారాణి, సూర్యకుమారి, విజయ్, జైకుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక పీ అండ్ టీ కాలనీకి చెందిన వల్లూరు వెంకటర రమణాచారి అదృశ్యమైన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. కార్పెంటర్‌గా పనిచేసే రమణాచారి ఈ నెల 15న పనికి వెళ్లాడు. అయితే తనకు ఒంట్లో బాగోలేదని పని నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతను కనిపించడం లేదు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెలకు దూరం.. ఉచిత ప్రైవేటు విద్య

- ఒకటి, మూడు కిలోమీటర్ల నిబంధనతో ఇక్కట్లు
- ఉచిత సీట్లు పొందలేకపోతున్న గ్రామీణ విద్యార్థులు
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు



నిడదవోలు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)



నిడదవోలు మండల విద్యావనరుల కార్యాలయం

నిడదవోలు రూరల్: పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. అయితే పాఠశాల విద్యార్థి నివాసం నుంచి ఒకటి లేదా మూడు కిలోమీటర్ల లోపు ఉండాలనే ప్రభుత్వ నిబంధన గ్రామీణ విద్యార్థులకు శాపంగా మారింది. పట్టణాల్లోనే ప్రైవేటు పాఠశాలలు ఉండటంతో ఆ పరిసర ప్రాంతాలకు చెందిన వారే ఉచిత సీట్లు పొందే అవకాశం ఉంది. దీంతో గ్రామీణ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు పొందలేకపోతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 19వ తేదీతో గడువు ముగియనుంది. అయితే ఉచిత విద్య సీట్లపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వ అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. మండల విద్యాశాఖ కార్యాలయాల్లో, సచివాలయాల వద్ద ఎటువంటి పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీట్లు ఇస్తారనే విషయం తల్లిదండ్రులకు తెలియకపోవడంతో దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు పాఠశాలల్లో ఉచిత విద్యను అమలు చేయాలి. నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలకు చెందిన 537 ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్, ప్రైమరీ పాఠశాలల్లో ఉచిత విద్యకు సీట్లు కేటాయించనున్నారు.

ఉన్నత చదువులే లక్ష్యంగా..

విజ్ఞానంతోనే పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవచ్చు అనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఓ వైపు నాడు–నేడు పథకంలో భాగంగా సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతూ మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సమీప ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని అప్పటి ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను పక్కాగా అమలు చేసింది. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉచిత సీట్లు పొందిన పేద విద్యార్థులు కూడా 30 శాతం ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కొంతమంది తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని విద్యాశాఖాధికారులను గట్టిగా నిలదీయడంతో వెనక్కి తగ్గారు.

- విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం మందికి ఉచిత సీట్లు కేటాయింపు
- ఉచిత సీట్లపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం అలసత్వం
- దరఖాస్తు చేసుకోవడానికి నేటితో ముగియనున్న గడువు
- కొవ్వూరు డివిజన్‌లో 537 ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్, ప్రైమరీ పాఠశాలలు

శాపంగా మారిన నిబంధనలు

ఉచిత సీట్లు కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలు గ్రామీణ పేద విద్యార్థులకు శాపంగా మారాయి. విద్యార్థి నివాసం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో సీట్లు పొందేందుకు మొదటిగా అవకాశం కల్పిస్తారు. ప్రతికూల పరిస్థితుల ఆధారంగా మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. దీంతో నిడదవోలు మండలంలో శివారు గ్రామాలైన మునిపల్లి, పెండ్యాల, కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాలకు చెందిన విద్యార్థులకు సీట్లు దక్కే అవకాశం ఉండటం లేదు.

మండలాన్ని యూనిట్‌గా తీసుకుని సీట్లు కేటాయించాలి

ప్రభుత్వం స్పందించి ఉచిత సీట్లు కేటాయింపునకు ఏర్పాటు చేసిన నిబంధనలను సడలించి మారుమూల గ్రామాల విద్యార్థులు కూడా సీట్లు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉచిత సీట్లపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయడంతోపాటు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యాశాఖ అధికారులు, ప్రజాసంఘాల నాయకులతో ఒక కమిటీ నియమించి అర్హులైన పేదలకు సీట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని గ్రామీణ విద్యార్థులకు సీట్లు కేటాయించేలా నిబంధనలు సడలించాలనే డిమాండ్‌పై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

విస్తృత ప్రచారం చేయాలి



విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు పక్కాగా అమలు చేసేలా పాలకులు శ్రద్ధచూపాలి. గ్రామాల్లో ఉచిత విద్యపై విస్తృత ప్రచారం చేయాలి. అర్హులైన వారందరికీ ఉచిత సీట్లు దక్కే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గెద్దం రవీంద్రబాబు, కెఎన్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సమిశ్రగూడెం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో గతేడాది ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ సోమవారం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కేఎస్‌వీ గణేష్, ఎంఈఓ, నిడదవోలు

మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టు అక్రమం

నల్లజర్ల: మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టు అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఖండించారు. ఉద్దండరాయుడుపాలెంలోని ఆయన ఇంటి పైకి వచ్చి, ఘర్షణ పడిన టీడీపీ కార్యకర్త రాజును వదిలేసి సురేష్‌ను అరెస్టు చేయడమేమిటని, ఇది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యేనని అన్నారు. ఈ సంఘటనపై సురేష్ భార్య ముందుగానే ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, టీడీపీ కార్యకర్త రాజు భార్య ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోవడం ఎంతవరకూ న్యాయమో ఆలోచించాలని అన్నారు. సురేష్‌ను చంపేయాలని వీరంగం సృష్టించి, ఆయన కార్లు ధ్వంసం చేసిన రాజును ఏమీ అనకుండా వదిలేసి, సురేష్‌ను, ఆయన సోదరుడు ప్రభుదాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం వెనుక ప్రభుత్వ తీరు స్పష్టంగా కనపడుతోందని దుయ్యబట్టారు. తీసుకుంటే ఇద్దరి ఫిర్యాదులూ స్వీకరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా కూటమి నేతలు దిగజారారని అన్నారు. సురేష్ అరెస్టును ఖండించిన వారిలో ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, నాయకులు తాడిగడప శ్రీనివాసరావు, కారెం రాంబాబు తదితరులున్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో మంత్రి కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు, తదితరులు

నిడదవోలు : పహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన భారత పౌరులకు, వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు ఆత్మలకు శాంతి చేకూరాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రార్థించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీని నిడదవోలు పట్టణంలో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ పోలీస్ స్టేషన్, ఓవర్ బ్రిడ్జి సెంటర్, గణేష్‌చౌక్ సెంటర్ల మీదుగా గణపతి జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. వీరజవాన్ మురళీనాయక్ మృతికి సంతాపంగా మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. పట్టణానికి చెందిన ముగ్గురు మాజీ జవాన్లను సత్కరించారు. ర్యాలీలో ప్రత్యేకంగా ప్రదర్శించిన 300 మీటర్ల జాతీయజెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆస్పత్రి భవనం



పోతవరంలో అసంపూర్తిగా ఆసుపత్రి భవనం

నల్లజర్ల: ఆసుపత్రి భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని 12 గ్రామాల ప్రజలు ఎనిమిదేళ్లగా ఎదురు చూస్తున్నారు. నల్లజర్ల మండల జనాభా 90 వేలకు పైగా పెరగడంతో పోతవరంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1.24 కోట్లతో భవన నిర్మాణానికి అప్పటి సీఎం హోదాలో స్వయంగా చంద్రబాబే ఇక్కడికి వచ్చి ఆ ఏడాది ఏప్రిల్ 29న ఆర్భాటంగా శంకుస్థాపన చేసారు. శంకుస్థాపన చేసిన రెండేళ్లకుగాని 2019 ఫిబ్రవరి వరకు పనులు ప్రారంభం కాలేదు. రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో ఉన్న బ్రిటీష్ హయాంలో ఏర్పాటు చేసిన జైలు కట్టడాన్ని పడగొట్టి ఈ ఆసుపత్రి నిర్మాణం చేపట్టారు. 2022 ఆగస్టు నాటికి ఈ భవనాన్ని సంబంధిత శాఖకు అప్పగించాల్సి ఉంది. కాంట్రాక్టరు పనులు పూర్తి చేయడానికి గడువు పొడిగిస్తూ జాప్యం చేస్తున్నారు. కాంట్రాక్టర్ విజ్ఞప్తి మేరకు గడువు పొడిగిస్తూ పలు దఫాలు అనుమతులు ఇచ్చినట్లు సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాబాబు తెలిపారు. ప్రస్తుతం కాంట్రాక్టరు జాడ లేదు. దాదాపు 75 శాతం వరకూ పనులు పూర్తయ్యాయి.

కమ్యూనిటీ హాలులో వైద్య సేవలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం పూర్తి కాకపోవడంతో స్థానిక వైఎస్సార్ సీపీ పెద్దలు స్పందించి గ్రామానికి చెందిన కమ్యూనిటీ భవనంలో కొంత భాగాన్ని కేటాయించారు. అప్పటి నుంచి అందులోనే అరకొర వసతులతో ఆస్పత్రి కొనసాగుతోంది. వ్యాక్సిన్లను నల్లజర్ల నుంచి తెచ్చుకునే వారు. నిత్యం దూర ప్రాంతాల నుంచి 80 నుంచి 90 మంది రోగులు ఈ ఆస్పత్రికి వస్తారు. సొంత భవనం లేని కారణంగా పూర్తిస్థాయిలో వైద్యం అందించలేకపోతున్నామని డాక్టర్లు చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లినా పెద్దగా స్పందన లేదని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఆసుపత్రిని త్వరితగతిన పూర్తిచేసి రోగులకు వైద్యం సేవలందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బదిలీల్లో 'ఉత్తమ' ఉపాధ్యాయులకు అన్యాయం

కడియం: ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తోందన్నారు. స్కౌట్ అండ్ ఎస్‌సీసీ, రాష్ట్ర సంఘ నాయకులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు పొందినవారికి పాయింట్లు కేటాయించలేదని పేర్కొన్నారు. గత బదిలీల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు పాయింట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఈసారి బదిలీల్లో మాత్రం వీరికి అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద కలుసుకున్న 1997-2000 బ్యాచ్ విద్యార్థులు



గోపాలపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాళ్లపూడి : బాల్య స్నేహితులంతా 25 ఏళ్ల అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని ఆనందంగా సందడి చేసారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–2000 ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఉద్యోగ, వ్యాపారరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. చిన్ననాటి నుంచి 10వ తరగతి వరకు కలసి చదువుకున్న స్నేహితులు సుదీర్ఘ విరామం తర్వాత ఒకే చోట చేరి, ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ తమ బాల్య మధురమైన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి తమ పాఠశాలలో గురువులు నేర్పిన క్రమశిక్షణ, విద్యావిధానం తమను జీవితంలో ఉన్నతస్థానాలకు చేర్చాయని వారు సంతోషం వ్యక్తం చేసారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ గురువులు ప్రసాద్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02లో టెన్త్ 2001–02 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో అప్పటి చిలిపిచేష్టలు, అల్లరిపనులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తమతో పాటు చదువుకుని అకాల మృత్యువాత పడిన స్నేహితులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో విద్య బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వీరి జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.70 వేలతో విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు సైకిల్ షెడ్డు ఏర్పాటు చేశారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు

దేవరపల్లి: కార్మికులు తమ హక్కుల పరిరక్షణకు రాజీ లేని పోరాటాలు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు, న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు పి.సూర్యారావు అధ్యక్షతన గౌరీపట్నంలో ఆదివారం జరిగిన ఎర్త్ మూవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐక్యంగా తొమ్మిది రోజులు సమ్మె చేసి మెరుగైన వేతనాలను సాధించుకున్న పొక్లెయిన్ ఆపరేటర్లను అభినందించారు. కార్మిక వర్గ ఐక్య పోరాటాలే విజయతీరాల వైపు నడిపిస్తాయని అన్నారు. కార్పొరేట్ యుగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కార్మిక వర్గం జీవనోపాధి సంక్షోభానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ రంగం సహజ వనరులను దోపిడీ చేస్తోందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా అణచివేస్తున్నాయని అన్నారు. కార్మికుల శ్రమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు మూత పడి లక్షలాదిగా కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. సూర్యారావు మాట్లాడుతూ, సుమారు 6 వేల మంది కార్మికులు క్వారీ పరిశ్రమలోని వివిధ విభాగాల్లో జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. పొక్లెయిన్ ఆపరేటర్లు సమ్మె చేసి, నెలకు రూ.3,300 అదనంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేయగా, యజమానులు రూ.3 వేలు ఇవ్వడానికి అంగీకరించారని, ఇది కార్మికుల ఐక్య విజయమని చెప్పారు.

నూతన కార్యవర్గం

ఈ సందర్భంగా జిల్లా ఎర్త్ మూవర్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.సూర్యారావు, గౌరవ న్యాయసలహాదారుగా నంబూరి శ్రీమన్నారాయణ, అధ్యక్షుడిగా ఎస్.హరగోపాల్, ఉపాధ్యక్షులుగా జి.ఆర్య, టి.వీరపండు, ప్రధాన కార్యదర్శిగా చిట్టితోటి రమేష్, సహాయ కార్యదర్శులుగా పాకా రవికుమార్, ఎన్.భరత్, కోశాధికారిగా సీహెచ్ సతీష్, పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమేష్ కూడా పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'నిడిగట్ల'



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: మండలంలోని సీతారామపురంలో జరుగుతున్న శివాజీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నిడిగట్ల టీమ్ విజేతగా నిలిచింది. అడబాల తేజ, సూరపురెడ్డి వాసు, గ్రామ యువత ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్స్‌లో 32 గ్రామాల నుంచి 32 టీమ్‌లు విజయం కోసం తలపడ్డాయి. అయితే ఫైనల్‌గా జరిగిన పోరులో గాదరాడ టీమ్‌తో నిడిగట్ల టీమ్ పోటీపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో నిడిగట్ల టీమ్ విజయాన్ని అందుకుని విన్నర్‌గా ట్రోఫీతోపాటు రూ.15 వేల నగదును బహుమతిగా సొంతం చేసుకుంది. రన్నర్‌కి రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులతోపాటు గ్రామపెద్దలు కూడా పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం



పురుషోత్తపట్నం కొత్త కాలనీలో రోడ్డుకు అడ్డుగా కూలిన విద్యుత్ స్తంభం

సీతానగరం: ఈదురు గాలులు, వర్షాలకు పురుషోత్తపట్నంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. పురుషోత్తపట్నం కొత్త కాలనీలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షాలకు వ్యవసాయ బోర్లకు అందించే విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుకు అడ్డుగా పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది కూలిన స్తంభం నుంచి వైర్లు వేరు చేసి, ఇళ్లకు అందించే విద్యుత్ లైన్ ద్వారా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ లైన్ కలిపారు. అయితే స్తంభాన్ని రోడ్డుపై అలాగే వదిలేశారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల విద్యుత్ లైన్‌కు వ్యవసాయ బోర్ల లైన్ కలపడంతో లో ఓల్టేజ్ సమస్య ఉంటుందని, వీలైనంత త్వరగా సరఫరా వేరు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. రోడ్డుకు అడ్డుగా పడిన స్తంభం తొలగించాలని పలువురు కోరుతున్నారు.

చదరంగంతో ఆలోచనా విధానం మెరుగు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చదరంగం ఆడటం వలన విద్యార్థుల ఆలోచనా విధానం మెరుగుపడుతుందని చెస్ కోచ్ కంచుమర్తి జగన్నాథం తెలిపారు. ఆదివారం స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం, నీతికథలు చెప్పడంతో పాటు యోగా, చదరంగం తరగతులు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, బొడ్డు శ్రీనివాసు, వంగపండు హరనాథ్, పాడిపిరెడ్డి కృష్ణ, మతల రమేష్ పాల్గొన్నారు.